క్లుప్తంగా

భూలోకమాత ఉత్సవాలు ప్రారంభం

ఆనందపురం: ఆనందపురంలో కొలువైన భూలోకమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి


సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ కొత్తకల్లివానిపాలెం యాతపేటలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పడు, రాష్ట్ర సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అంగటి రాము, జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ సారథ్యంలో అభివృద్ధి పరుగులు


మాట్లాడుతున్న 6వ వార్డు అధ్యక్షురాలు వరలక్ష్మి

పీఎం పాలెం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంకల సారథ్యంలో 6వ వార్డు ఎంతగానో అభివృద్ధి చెందిందని ఆ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. వార్డులో మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి సాధించామంటే అది ఎమ్మెల్యే, కార్పొరేటర్ల చలువేనన్నారు. కొన్ని మీడియాల్లో వారికి వ్యతిరేకంగా తాను మాట్లాడినట్టు కట్టుకథ అల్లారని, అందులో నిజం లేదని చెప్పారు. అంతమాత్రం చేత పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించలేరని ఆమె పేర్కొన్నారు. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును మళ్లీ గెలిపించుకుని.. మరోమారు జగనన్నను సీఎం చేసుకుంటామని ఈ సందర్భంగా వరలక్ష్మి అన్నారు. సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యురాలు రాజేశ్వరి మాట్లాడుతూ యాత్ర పేరుతో ప్యాకేజీ స్టార్ పవన్ హడావుడే తప్పా.. ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కన్వీనర్ల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు

కన్వీనర్ల సేవలు పార్టీకి ఎంతో ముఖ్యమని, వారి భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీమా సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న వారికి భద్రత కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం భీమిలి నియోజక వర్గం పరిధిలో గల గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్ల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. వారి భద్రత కోసం ప్రతి కన్వీనర్‌కు బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించారని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చారని, అవినీతికి తావు లేకుండా పథకాలను అమలు పరుస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మరలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావలసిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎర్రమట్టి దిబ్బలు కబ్జాకు గురయ్యాయని ఆరోపిస్తున్నారని అందులో ఎంతమాత్రం నిజం లేదన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా నియోజక వర్గంలో సేవలు అందిస్తున్నానని, అవినీతి జరిగినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, మండల సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి గంద్రెడ్డి శ్రీనివాస్, ఆనందపురం, భీమిలి జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, గాడు వెంకటప్పడు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఎలమంచిలి సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి


నేతాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

భీమునిపట్నం : స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు బింగి హరికిణ్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌నాయుడు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేతాజీ సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకుని బ్రిటిష్ వారిపై వీరోచిత పోరాటం చేశారన్నారు. అంతటి మహావీరుడిని అందరు గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.మధునాయుడు, రామకృష్ణ, కొంకి వెంకటేష్, కృష్ణ, శ్రీను, చంటి, మోహన్, రాజశేఖర్, సాగర్, లోకేష్, రాజు పాల్గొన్నారు.

అనంతుని మెట్టు భూమి కౌలు శిస్తు రూ.2 లక్షలు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో శుక్రవారం అనంతుని మెట్టు భూమి కౌలు ధర ఏడాదికి రూ.2 లక్షలుగా నిర్ణయించారు. మండలంలోని అర్చకునిపాలెంలో అనంత పద్మనాభస్వామికి చెందిన సర్వే నంబర్ ఏడులోని 8.75 ఎకరాల విస్తీర్ణం గల మెట్టు భూమిని 2023 సెప్టెంబర్ ఒకటి నుంచి 2026 ఆగస్టు 31 వరకు కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించారు. విజయనగరానికి చెందిన ముదపాటి కేశవ రామ్మూర్తిరాజు అధికంగా ఏడాదికి రూ.2 లక్షలు ఇస్తానని చెప్పడంతో అతనికి భూమిని కౌలుకు వచ్చారు. ఈవో నానాజీబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పాల్గొన్నారు.

కళాధరరావుకు యోగ రత్న అవార్డు


కళాధరరావును అభినందిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

మధురవాడ : మధురవాడకు చెందిన ప్రముఖ యోగా గురువు వీకేవీకే కళాధరరావుకు జాతీయ స్థాయిలో యోగరత్న అవార్డు వచ్చింది. ఈ నెల 5, 6, 7 తేదీల్లో బెంగళూరు విద్యారాయణపూర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ యోగా చాంపియన్ షిప్–2023 పోటీల్లో ఆయన విశేష ప్రతిభ కనబరచి నందుకు ఈ అవార్డు వరించింది. వెటరన్ యోగా శిక్షకుడు అయిన కళాధరరావు గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు, బహుమతులు అందుకున్నారు. మద్దిలపాలెం ఆర్‌టీసీ డిపోలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఇతను సత్కారం అందుకున్న నేపథ్యంలో విశాఖ, విజయనగరం జిల్లాల విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీ దుర్గాప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ మోహనరావు, సహచర ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

ఈట్ స్ట్రీట్ పనులు ప్రారంభం


అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈట్‌స్ట్రీట్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పనులను పర్యవేక్షించారు. రూ. 36 లక్షలతో మొత్తం 18 షాపులు ఇక్కడ నిర్మించనున్నామని తెలిపారు. ఇక్కడున్న కొంత స్థలాన్ని పార్కు కోసం అభివృద్ధి చేస్తూ ఈట్ స్ట్రీట్‌ను నిర్మించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు ఈ పనులు నిలిపివేయాలని జోనల్ కమీషనర్‌ను కోరారు. ఇక్కడ తామంతా సరదాగా కాలం గడుపుతామని, ఇక్కడున్న బెంచీలను తొలగించి ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయడం తగదని అన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఇవ్వాలని, వాటిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు.

ప్రతిపక్షాలు విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మిథిలాపురి వుడా కాలనీలో లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని చూస్తుంటే సహకరించాల్సింది పోయి ప్రతిపక్షాలు విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నాయిని, ఇది సరికాదని, వారి కుట్రలను ప్రజలంతా గమనించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలోని పలు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని పలు నివాసాలు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పార్కుల పరిరక్షణ, సీసీ రోడ్డు నిర్మాణం, ఎస్ఎఫ్ఎస్ స్కూలు వద్ద డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరా సమయం పెంపు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు తదితర సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, పోతిన శ్రీనివాసరావు, గోపి, పోతిన హనుమంతరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఎం. రాజేశ్వరి, ఎంవీ రమణమూర్తి, ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు పెంగ్ర అప్పన్న, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్. బాబ్జి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

కూలంకషంగా ఓటర్ల జాబితాల పరిశీలన


వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి పరిధిలో కూలంకషంగా ఓటర్ల జాబితాల పరిశీలన జరుగుతోందని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఇంటింటికీ బీఎల్‌వోలు, బీఎల్ఏలు వెళ్లి జాబితాలను పరిశీలిస్తున్నారని అన్నారు. వీటిలో కొత్తవాటి చేర్పులు ఉంటే వాటి వివరాలు నమోదు చేస్తున్నారని, తొలగించవలసిన పేర్లు తొలగిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 80 శాతం పరిశీలన పూర్తయిందన్నారు. ఈనెల 21వ తేదీకల్లా మిగిలిన వాటిని పూర్తి చేయవలసి ఉందని తెలిపారు. రాజకీయ నాయకులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. బీఎల్‌వోలు ఎక్కడైనా ఇళ్ల వద్దకు రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ వేణుగోపాల్, పార్టీ నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, గంటా నూకరాజు, కానూరి రాంబాబు, కంటుభుక్త రామానాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


వివరాలు తెలుపుతున్న డ్వామా ఏపీడీ రోజారాణి

భీమునిపట్నం : మండలంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోజారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇక్కడ 16 పంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, కాలువలు, చెరువు గట్ల నిర్మాణాలతో పాటు మొత్తంగా 543 పనులు రూ. 5.22 కోట్లతో జరిగాయన్నారు. వీటిని అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారని తెలిపారు. అన్ని పనులు నిబంధనలకు లోబడి పూర్తి నాణ్యతతో జరిగాయని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. పనులు ఎక్కడ జరిగిందీ, ఎంత ఖర్చయిందీ తెలిపారు. సామాజిక తనిఖీ విభాగం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కె.మన్మథరావు, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


మిథిలాపురి వుడా కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అభివృద్ధి–సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో రూ.1.28 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపకుండా డీబీటీ, ఇతర పద్ధతుల ద్వారా అందిస్తూనే వార్డుల్లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదల చేసి వెంట వెంటనే పనులు పూర్తి చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహనరావు, గోపి, పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, జెడ్సీ కనకమహాలక్ష్మి, ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం.. దేవదాయ శాఖ పరం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు


ఆనందపురంలోని కల్యాణ మండపం

వేలం పాట ద్వారా అద్దెకు మండపం

ఆనందపురం: ఆనందపురంలోని గుడిలోవ రంగనాథస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కల్యాణ మండపం నిర్వహణ వ్యవహారానికి తెరపడింది. మండపం ఉన్న స్థలం దేవదాయ శాఖకు చెందినది కావడంతో ప్రభుత్వ నిధులతో నిర్మించినా.. ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో దాని నిర్వహణ పంచాయతీ చేపట్టడానికి అవకాశం లేక ఆరేళ్లుగా కల్యాణ మండపంలో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించ లేదు. ఈక్రమంలో మండపం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. దేవదాయ శాఖ కూడా ఆదాయాన్ని కోల్పోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం గుడిలోవ దేవస్థానం ఈవో సిరికి నానాజి ఆధ్వర్యంలో మూడేళ్ల పాటు అద్దె ప్రాతిపదికన కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. ఈ మేరకు హెచ్చు పాటగా ఏడాదికి రూ.10 వేల చెల్లించడానికి ముందుకొచ్చిన మీసాల నాయుడు అనే వ్యక్తికి పాట ఖరారు చేశారు.

మండపం అభివృద్ధికి ముందుకొచ్చిన పాటదారుడు

కల్యాణ మండపం పూర్తిగా పాడై ప్రస్తుతం అక్కడ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీలు లేకుండా ఉంది. దీంతో తన సొంత నిధులతో మండపం అభివృద్ధితోపాటు అన్ని సౌకర్యాలు కల్పించడానికి పాటదారుడు మీసాల నాయుడు ముందుకు రాగా.. దేవదాయ శాఖ అధికారులు అంగీకారం తెలిపారు. కల్యాణ మండపం చుట్టూ ప్రహరీ, భవనం పైన రేకుల షెడ్డు, భవనం మొత్తం మరమ్మతులు చేయడానికి నిర్ణయించారు. దేవదాయ శాఖ నిబంధనలకు లోబడే పనులు చేపట్టాలని, అందుకు సంబంధించి ఆ శాఖ ఎటువంటి పెట్టుబడి పెట్టదని అధికారులు స్పష్టం చేశారు. అభివృద్ధి చేసిన తర్వాత పాట కాలపరిమితి ముగిసిన మూడేళ్ల అనంతరం కల్యాణ మండపాన్ని పాటదారుడు దేవదాయ శాఖకు తిరిగి అప్పగించడానికి నిర్ణయించారు. దీంతో చాలా కాలం తర్వాత ఈ మండపం వినియోగంలోకి రానున్నండడంతో స్థానికులకు ఉపయోగకరంగా మారనుంది.

వైభవంగా శ్రావణమాస పూజలు


అష్టలక్ష్మీ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

కొమ్మాది : స్థానిక అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారికి తామర పుష్పాలతో ప్రత్యేక హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారి సన్నిధిలో : రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్ద ఎత్తున సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

భీమిలి డివిజన్‌లో..

తగరపువలస : భీమిలి డివిజన్‌లో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ట్రస్టీలు, కమిటీ ప్రతినిధులు ఆలయాలను అందంగా అలంకరించారు. సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాలతో పాటు బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయం, కొండపేట సంతోషిమాత ఆలయం, దుర్గాంబిక, బొగ్గులరోడ్డు పోలమ్మ, దుర్గమాంబ, బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

శృంగేరీ పీఠంలో..

పీఎం పాలెం : మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో బక్కన్నపాలెం రోడ్డులోని అంజనాద్రిపై కొలువు దీరిన శ్రీ శృంగేరీ శంకర మఠంలో వెలసిన శారదా పరమేశరి, ఉమాదేవి అమ్మవారకు ప్రత్యేక పూజలు చేశారు. కారుషెడ్ బబ్బేలమ్మ, ఆర్‌హెచ్ కాలనీ నూకాలమ్మ, దుర్గాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు చేశారు.

ఆలయాలకు భక్తుల తాకిడి..

మధురవాడ : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలోని అన్నపూర్ణ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చనతో పూజలు ప్రారంభం అయ్యాయి. అనంతరం కుంకుమ పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు.


శారదా పరిమేశ్వరి


దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

బ్యాగ్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


బ్యాగ్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావును సన్మానిస్తున్న సభ్యులు

ఆనందపురం: బ్రాయిలర్ ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (బ్యాగ్) అధ్యక్షుడిగా ఆనందపురానికి చెందిన కొట్యాడ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దిపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ పీర్ సాహెబ్(పెందుర్తి), కార్యదర్శిగా చిట్టూరి రామకృష్ణ(మధురవాడ), సంయుక్త కార్యదర్శిగా బి.సతీష్(విశాఖ), కోశాధికారిగా ఎస్.ఎన్.మాధవరావు(విశాఖ) నియమితులయ్యారు. సభ్యులుగా కృష్ణమూర్తి, గోపి, విజయ్, ఎం.రమేష్, కె.రమణ, సుబ్బారావు, సుభాన్, సుధా శ్రీను, లతా శ్రీను, సత్యనారాయణలను ఎన్నుకున్నారు. బ్యాగ్ మాజీ అధ్యక్షుడు మేకా నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కోళ్ల పెంపకందారులు, వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.